క్లుప్తంగా

తెలుగుజాతి సాహిత్య దిగ్గజం గుర్రం జాషువా

కర్నూలు(సెంట్రల్): తెలుగుజాతి సాహిత్య దిగ్గజం గుర్రం జాషువా అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతులను నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో..
శ్రీరామ్‌నగర్‌లో గుర్రం జాషువా జయంతిని కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద బాబు తదితరులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కొందరు స్వార్థపరులు సమాజాన్ని కులం, మతం, ప్రాంతం పేరుతో విభజన చేస్తున్నారని ఆనంద్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో..
కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో శుక్రవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, రచయిత కెంగార మోహన్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ హేమంత్ తదితరులు జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్రం జాషువా దేశం గర్వించదగ్గ కవి అన్నారు. విద్యార్థులు జాషువా రచనలు చదవాలన్నారు.

2న జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2న స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి బైరెడ్డి పక్కీరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌లైన్, క్వాడ్ స్కేటింగ్, రింక్ రేస్, రోడ్ రేస్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని, ధ్రువీకరణ పత్రం జిరాక్స్, ఆధార్ కార్డు, స్కూల్ బోనోఫైడ్ సర్టిఫికెట్లతో ఉదయం 8 గంటలకు హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడలోని రాజాస్ ట్యాంక్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కండి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ సూచించారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న హోమ్ ఆఫ్ హోప్ అనాథాశ్రమానికి ఆయన నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా శంకరశర్మ మాట్లాడుతూ అనాథ శ్రమాలు, వృద్ధాశ్రమాలను నిర్వాహకులు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చి నిర్వహిస్తుంటారని, అలాంటి వారికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలన్నారు.

డీసీఈ బాధ్యతల స్వీకరణ

కర్నూలు సిటీ: జల వనరుల శాఖ కర్నూలు ప్రాజెక్టు సీఈ కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా బి.రాజేంద్ర ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సీఈ కబీర్ బాషాను ఆయన పర్యాదపూర్వకరంగా కలిశారు. అన్ని సర్కిళ్ల ఇంజినీర్లతో సమన్వయం చేసుకుని నిర్దేశించిన పనులను సకాలంలో చేసేలా చర్యలు తీసుకోవాలని సీఈ సూచించారు. కార్యాలయం సిబ్బంది డీసీఈకి అభినందనలు తెలిపారు.

జగన్‌పై చంద్రబాబు నిరాధార ఆరోపణలు

- జగన్ తిరుమల దర్శనంపై అల్లర్లు సృష్టించే కుట్ర
- క్రిస్టియన్ అని చెప్పే పవన్‌ను డిక్లరేషన్ అడిగే దమ్ముందా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి
- వేంకటేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మేయర్ బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు

కర్నూలు (టౌన్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తున్న చంద్రబాబు.. కల్తీ లడ్డూ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం స్థానిక వెంకటరమణ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు నాయుడికి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న తిరుమల దర్శనానికి వెళతానని ప్రకటించడంతో ఎలాగైనా అడ్డుకోవాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందన్నారు. అల్లర్లు సృష్టించాలని, జగనన్నను అడ్డుకోవాలని చేస్తున్న కుట్రలు తెలుసుకుని తమ నాయకుడు తిరుమల వెళ్లడం విరమించుకున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రతిపక్ష నేత హోదాలో 2014 నుంచి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో సార్లు తిరుమలకు వెళ్లినా డిక్లరేషన్ అడగని అధికారులు ఇప్పుడు ఎందుకు అడుగుతున్నారో చెప్పాలన్నారు. దీనంతటికీ కారణం చంద్రబాబు నాయుడు నియమించిన ఈఓనే అన్నారు. ఎందుకు ఆయనపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. చంద్రబాబు కూడా చర్చిలకు వెళ్లి దేవుని వాక్యం చెప్పలేదా అని ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలను చంద్రబాబు అపవిత్రం చేస్తున్నారన్నారు. పాలన చేతకాని చంద్రబాబు నాయుడు.. రాజకీయాలకు సైతం వెంకన్న స్వామిని వాడుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు క్షమించినా వెంకన్నస్వామి క్షమించడన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా ఏ ఒక్క మంచి పని చేయని చంద్రబాబు.. తిరుపతి లడ్డూ వివాదాన్ని తీసుకొచ్చి మాజీ ముఖ్యమంత్రిపై నిరాధార ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. క్రిస్టియన్ అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను డిక్లరేషన్ ఎందుకు అడగడం లేదన్నారు. దేశంలోనే ఏపీ పరువును తీసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు తెర్నేకల్లు సురేందర్ రెడ్డి, మద్దూరు సుభాష్ చంద్రబోస్, దేవపూజ ఆచారీ, కేదార్‌నాథ్, షరీఫ్, కిషన్, మల్లి, గద్దం రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, విక్రమ సింహారెడ్డి, శ్రీనివాసరావు, సిట్రా సత్యనారయణ, క్రాంతికుమార్, రాజేశ్వరరెడ్డి, కటారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వెంకన్ననూ వదలని శిశుపాలుడు చంద్రబాబు


పూజలు చేస్తున్న వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులు కేదార్‌నాథ్

కర్నూలు (టౌన్): కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని సైతం వదలని శిశుపాలుడు.. చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్‌నాథ్ విమర్శించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ దుర్బుద్ధితోనే తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని అబద్ధాలు మాట్లాడటం ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. డైవర్షన్ రాజకీయాల కోసమే డిక్లరేషన్ తెర మీదకు తెచ్చాడన్నారు. జగనన్న ఎన్నోసార్లు తిరుమల వెంకన్నను దర్శించుకున్నారని, అప్పుడు డిక్లరేషన్ ఉందుకు అడగలేదన్నారు. కలియుగ దైవంతో పెట్టుకుంటే తగిన శాస్తి అనుభవించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్ల సూర్యుడు, ఆదిశేషు, మధు, వసంత్, గోపి, ధరణి పాల్గొన్నారు.

రేబిస్ మరణాలను అరికడదాం

- నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(అగ్రికల్చర్): కుక్కల ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధిని 2030 నాటికల్లా పూర్తిగా అరికడదామని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండారెడ్డి బురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాలలో పెంపుడు కుక్కల యజమానులతో సమావేశం నిర్వహించి రేబిస్ వ్యాధి గురించి వివరించారు. పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కుక్కలను ఆరోగ్యవంతంగా పెంచుకోవాలని, రెగ్యులర్‌గా టీకాలు వేయించడం, వీధి కుక్కలను నియంత్రించడం ద్వారా రేబిస్ మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. రేబిస్ వ్యాధికి చికిత్స లేదని, ఏటా పెంపుడు కుక్కలు, పిల్లులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా మాత్రమే నివారించవచ్చన్నారు. కుక్కలకు పశుసంవర్ధక శాఖ ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బహుళార్థ పశువైద్య శాల డీడీ డాక్టర్ హేమంత్‌కుమార్, కర్నూలు డివిజన్ డీడీ దుర్గాప్రసన్నబాబు, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు. అలాగే దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు అవగాహన కల్పించారు.

పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): పెంపుడు జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద డీఎంఅండ్‌హెచ్‌ఓ అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. రేబిస్‌కు లూయిస్ పాశ్చర్ వ్యాక్సిన్ కనుగొన్నారని, ఆయన వర్ధంతిని పురస్కరించుకుని రేబిస్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. పెంపుడు జంతువులకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. రేబిస్ వ్యాధి గురించి అవగాహన పెంపొందించేందుకు 'టీకా వేసుకుందాం-రేబిస్‌ను పారదోలుదాం' నినాదంతో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీ ప్రభుత్వ ఆసుపత్రి వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే పీఓ హేమలత, ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య రచనలను ప్రోత్సహించాలి
కర్నూలు కల్చరల్: సాహిత్య రచనలను ప్రోత్సహించాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. ఆర్టీసీ కాలనీలోని గణేష్ సాహితీ సదన్‌లో గణేష్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ కవయిత్రుల సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన కవయిత్రి లక్ష్మీపద్మజ, కర్నూలు రచయిత్రి బెన్నమ్మలకు సావిత్రీ బాయి పూలే అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీ సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త కవయిత్రులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం
కర్నూలు (లీగల్): కెనరా బ్యాంకు సామాజిక సేవ అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు ప్రశంసించారు. కోర్టు ఆవరణలో తాగునీటి సౌకర్యం, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్ర రావు, డివిజనల్ మేనేజర్ సురేష్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి పాల్గొన్నారు.

రోగులను నవ్వుతూ పలకరించండి
కర్నూలు(హాస్పిటల్): రోగులను నవ్వుతూ పలకరిస్తే వారికి వచ్చిన వ్యాధిలో సగం నయమైనట్టేనని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి చెప్పారు. శనివారం పెద్దాస్పత్రిలోని ఓల్డ్ లెక్చర్ గ్యాలరీలో నర్సింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మోటివేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఆయన మాట్లాడారు. రోగులకు సేవ చేయడంలో నర్సింగ్ సిబ్బంది పాత్ర కీలకమైందన్నారు. వైద్యంలో నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది అందరూ కలిసినప్పుడే డాక్టర్ మరింత గొప్పవాడవుతారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.

పూడికతీత పనుల్లో జాప్యం తగదు

కర్నూలు (టౌన్): మురుగు కాల్వల పూడికతీత పనుల్లో జాప్యం తగదని నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు అధికారులను హెచ్చరించారు. శనివారం ప్రకాష్ నగర్, రోజా వీధి, అశోక్ నగర్, సంకల్‌బాగ్ ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌పై మూతలు వేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై ఉందన్నారు.

మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో రాణించాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి పరమేశ్వర్‌రెడ్డి క్రీడాకారులకు సూచించారు. శనివారం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో కరాటే, రగ్బీ, సెపక్‌తక్రా క్రీడల ఎంపిక పోటీలు నిర్వహించారు. రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి


న్యాయమూర్తిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు (లీగల్): న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ కె.మన్మథరావు అన్నారు. శనివారం న్యాయవాద సంఘ కార్యాలయాన్ని సందర్శించి న్యాయవాదులతో మాట్లాడారు. బార్ అసోసియేషన్ నూతన కార్యాలయం, మునిసిఫ్ కోర్టులో లిఫ్ట్ మొరాయింపు తదితర సమస్యలను బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి ఉన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటండి


విజేతలుగా నిలిచిన రగ్బీ క్రీడాకారిణులు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని కర్నూలు రూరల్ ఎంఈఓ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ రగ్బీ, జిమ్నాస్టిక్స్, టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17 బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నిత్య జీవితంలో విద్యార్థులు క్రీడలను ఒక అంశంగా ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ పోటీలను విద్యార్థులు వినియోగించుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, హర్షవర్ధన్, వ్యాయామ ఉపాధ్యాయులు బాషా, శ్రీనివాసులు, సత్యకుమార్ పాల్గొన్నారు.

గీతా రత్న పురస్కార గ్రహీతకు సన్మానం


రమణను సన్మానిస్తున్న వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: ఏకాదశిని పురస్కరించుకుని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో శనివారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పారాయణం చేశారు. అంతకుముందు భగవద్గీత వ్యాప్తికి కృషి చేస్తున్న గీతా ప్రచార సంఘం అధ్యక్షులు, గీతా రత్న పురస్కార గ్రహీత డీవీ రమణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి, గోదా గోకుల వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఎయిర్‌పోర్టులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరో డ్రోమ్ కమిటీ, ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ సమావేశాలను కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులోమహిళా పోలీసులను ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు నుంచి కర్నూలుకు వెళ్లే ప్రయాణికలకు, విమానాశ్రయం నుంచి ఓర్వకల్లుకు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ప్రత్యేక బస్సును ప్రయాణికుల కోసం సమకూర్చుకోవాలని సూచించారు. ఎయిర్‌పోర్టు, దాని పరిసర ప్రాంతాల నుంచి చెత్తను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో వైద్య సౌకర్యాలు, అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, డీపీఓ నాగారజు నాయుడు పాల్గొన్నారు.

కుల నిర్మూలనపై పోరాటం


జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): మహాత్మా జ్యోతి బాపూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం ఉద్యమించాలని సీపీఎం ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.భాస్కర్ కోరారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని గోకారి భవన్‌లో నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యశోధక్ సంస్థ కులనిర్మూలన కోసం పోరాటం చేసి, ప్రజల్లో మార్పులు తెచ్చేందుకు కృషి చేసిందన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించండి

కర్నూలు న్యూసిటీ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా తెరిచే ఉంటాయని, బిల్లులు చెల్లించ వచ్చని విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి


సీఆర్ భవన్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): భగత్‌సింగ్ జయంతిని శనివారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయం, సీఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. 1907 సెప్టెంబర్ 28న పంజాబ్‌లో జన్మించిన భగత్‌సింగ్.. లాలలజపతి రాయ్, మహాత్మాగాంధీల పిలుపు మేరకు దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, బ్రిటీషు సామ్రాజ్యాన్ని సైతం గడగడలాడించారని పలువురు పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర నేటి సమాజం తెలుసుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వై.నగేష్, మాజీ కార్యదర్శి ఎండీ అంజిబాబు, అధ్యక్షుడు రాముడు, సీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసు లు, సీపీఐ జిల్లా నాయకులు ఎస్.మునెప్ప, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, కారుమంచి పాల్గొన్నారు.

ఆర్‌యూలో..
కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్‌లో..
కర్నూలు సిటీ: కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో భగత్‌సింగ్ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ ఎల్లా కృష్ణ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నగేష్, హెచ్‌ఎం వెంకటరెడ్డి, సంఘం నాయకులు సూరి, ఇమ్రాన్, తదితరులు భగత్‌సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

- బిక్యాంపులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్ర పటానికి సంఘం నాయకులు కిరణ్, నరేంద్ర, శశికాంత్, రాజేష్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.